
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 28 ఫిబ్రవరి 2024





ఖమ్మంలో విజయ సంకల్ప ర్యాలీలో కేంద్రమంత్రితోపాటు జిల్లా నేతలు



కళాకారుల డప్పు నృత్యం

మళ్లీ బీజేపీదే అధికారం

- కేసీఆర్ వ్యతిరేకతతోనే కాంగ్రెస్ గెలిచింది
- కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసం లేదు
- ఖమ్మం జిల్లాలో కాషాయజెండా ఎగరాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి
- ఖమ్మంలో విజయ సంకల్పయాత్ర
- పాల్గొన్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

ఖమ్మం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రాబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సృష్టించబోతున్నారని బీజేపీ నేతలు పేర్కొన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని పదేళ్లలో బీజేపీ సారథ్యంలోని ప్రధాని నరేంద్రమోదీ చేసి చూపించి దేశ అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. భారతీయ జనతాపార్టీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో సాగింది. జిల్లా కేంద్రం ఖమ్మంలో మంగళవారం సాయంత్రం యాత్ర నిర్వహించారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలనుంచి ప్రారంభమైన ర్యాలీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. డప్పు కళాకారులు, మహిళల కోలాట నృత్యాలతో బీజేపీ యువజన మోర్చా కార్యకర్తలతో సంబరంగా ఈ యాత్ర మయూరిసెంటర్ వరకు సాగింది. అయితే కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే యాత్రలో కొద్దిసేపు మాత్రమే పాల్గొని హైదరాబాదు వెళ్లిపోయారు.

అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో రాష్ట్ర, జిల్లా బీ.జేపీ నేతలు ప్రసంగించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ 400సీట్లతో దేశంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రాబోతుందని, మూడోసారి ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించబోతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతిలేని పాలన సాగుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం అభివృద్ధిలో ముందుకు పోతుందన్నారు. కశ్మీర్‌లో దేశ జెండా ఎగురుతుందంటే అది బీజేపీ పరిపాలన ఘనతేనని తెలిపారు. దేశాభివృద్ధి, రక్షణ లక్ష్యంగా బీజేపీ పాలన సాగుతుందన్నారు.

కాంగ్రెస్‌కు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 40సీట్లకు మించి రాబోవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి రాలేదని, కేసీఆర్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ గెలిచింది తప్ప ప్రజాభిమానంతో గెలవలేదన్నారు. కేంద్రంలో వచ్చేది మళ్లీ బీజేపీ ప్రభుత్వమేనన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా ప్రజలు బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఈ జిల్లాలో కాషాయజెండా ఎగరాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రూ.12వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయని, ఇంత పెద్దఎత్తున జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని కోరారు.

యాత్ర ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బీజేపీ నాయకులు గంటేల విద్యాసాగర్, దేవకి వాసుదేవరావు, గోంగూర వెంకటేశ్వర్లు, తాండ్ర వినోదరావు తదితరులు ప్రసంగించారు. ఖమ్మం జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింతగా అమలవుతాయని పేర్కొన్నారు. ఈ యాత్ర సభలో నున్నా రవికుమార్, మంద సరస్వతి, శ్యామ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీనే ప్రధాని

- రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలను గెలుస్తాం
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి మహేంద్రనాథ్‌పాండే



7

ఇంటర్ పరీక్షలకు
సర్వం సిద్ధం

- నేటినుంచి మార్చి 19 వరకు..
- ఖమ్మం జిల్లాలో 70, భద్రాద్రి జిల్లాలో 36 కేంద్రాలు
- పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- నిమిషం నిబంధన అమలు
- ఏర్పాట్లను సమీక్షించిన ఇరు జిల్లాల కలెక్టర్లు



నెంబర్లు వేస్తున్న దృశ్యం

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, విద్యుత్, మంచినీటి సదుపాయాలను పరిశీలించి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స కేంద్రాలనూ ఏర్పాటు చేశారు.

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 27: ఖమ్మం జిల్లాలో ప్రథమ సంవత్సర విద్యార్థులు18,481, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,097 మొత్తం 36,578మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం 70పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. అధికారులకు ఇచ్చిన బుక్‌లెట్‌లోని మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నిర్ధారిత సమయంలో ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు అందించాలని, వాటిపై విద్యార్థులు హాల్‌టికెట్ నెంబర్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతించరు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నాయి. పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఎక్స్‌రాక్స్ కేంద్రాలను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుంది.

భద్రాద్రి జిల్లాలో..

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రియాంక తెలిపారు. సలహాలు, సూచనల కొరకు రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 040-24601010, 040-24655027 నెంబర్లు కానీ, అలాగే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన 7997994366, 8919961013, 9441817478 కంట్రోల్ రూం నెంబర్లుకు ఫోన్ చేయవచ్చు. జిల్లాలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 10,200 మంది, ద్వితీయ సంవత్సరానికి 9277 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే తక్షణమే పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య శిబిరంలో సేవలు తీసుకోవాలని తెలిపారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను www.tsbie.cgg.gov.in ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ఎలాంటి సంతకాలు అవసరం లేదని, నేరుగా అనుమతిస్తారని తెలిపారు.



మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

రైతులను దగా చేస్తే లైసెన్సుల రద్దు

- వ్యాపారులకు కలెక్టర్ గౌతమ్ హెచ్చరిక

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 27: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం సందర్శించారు. యార్డులో తిరుగుతూ మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడుతూ ధరలు ఎలా దక్కుతున్నాయని ఆరా తీశారు. నాణ్యత బాగున్నా ధరలు తగ్గించే వ్యాపారులను ఉపేక్షించేది లేదని, రైతులను నష్టపరిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దగా చేసే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేస్తామని తెలిపారు. మిర్చిలో కూడా తేమశాతం తెలుసుకునేందుకు తగిన ఏర్పాట్లను చేయాలని ఆయన అధికారులకు సూచించారు. మార్కెట్‌కొచ్చే ప్రతిబస్తాను కొనుగోలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ. అలీం, పీడీ ఎంఐపీ రమణ, మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రెటరీ బజారు, అసిస్టెంట్ సెక్రెటరీ వజీరుద్దీన్, ఏఈవో శిరణ్మయి, తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై కసరత్తు



అనధికారిక లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు పోసి ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్య, మధ్యతరగతి ప్రజలు, రూ. కోట్లు పెట్టి భూములు కొనుగోలు చేసిన రియల్టర్లు గత కొన్నేళ్లుగా ఆయా భూములు అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి కసరత్తు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

- ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో 1,15,329 దరఖాస్తులు
- ఖమ్మం నగర పరిధిలోనే 51,395
- క్రమబద్ధీకరణతో ఒనగూరే ఆదాయం రూ.50 కోట్ల పైనే
- ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారూ పెద్ద సంఖ్యలోనే..

ఖమ్మం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):2020లో స్థలాల క్రమబద్ధీకరణ నిలిపివేసిన అనంతరం, ప్రభుత్వం స్థలాల మార్కెట్ ధరలను అప్‌డేషన్ కూడా చేయించింది. 2022 జులైలో ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రేషన్ శాఖకు లింకు చేసింది. శాఖ సైట్‌లో ప్రత్యేకంగా ఎల్ఆర్ఎస్ డాక్యుమెంట్ అప్‌డేషన్ మాడ్యుల్‌ను ఇచ్చి దానిద్వారా 2020 మార్కెట్‌వాల్యూ అప్‌డేషన్ ఆప్షన్‌ను ఇచ్చింది. ఆయా ప్రొఫార్మాలో సంవత్సరాల వారీగా డాక్యుమెంట్లను సూచిస్తూ ఆయా డాక్యుమెంట్లలో ఉన్న భూమికి సంబంధించి 2020లో ఆ స్థలానికి ఉన్న మార్కెట్ వాల్యూను అప్‌డేట్ చేయాల్సిందిగా సంబంధిత రిజిస్ట్రార్లకు సూచించారు. ఆ సమయంలోనే ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి నిర్ణయం తీసుకుంటారని భావించినప్పటికీ అది ముందుకు సాగలేదు.

కాగా ప్రస్తుతం ప్రభుత్వం పాత జీవో ప్రకారం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం 100 చదరపు మీటర్లు ఉన్న స్థలాలకు చ.మీ.కు రూ. 200 చొప్పున, 101 చ.మీ. నుంచి 300 చ.మీ. వరకు ఉన్న స్థలాలకు రూ.400 చొప్పున, 301 చ.మీ. నుంచి 500 చ.మీ. వరకు ఉన్న స్థలాలకు రూ.750 చొప్పున నగదు చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించాలని పాత జీవోలో పేర్కొన్నారు. గజం రూ. 3వేల లోపు ఉంటే 25శాతం, రూ.3 నుంచి రూ.5 ఉంటే 50 శాతం రూ. 5 నుంచి రూ.10వేల వరకు ఉంటే 75 శాతం, రూ.10వేలకు పైగా ఉంటే వంద శాతం క్రమబద్ధీకరణ ఫీజులను చెల్లించిన వారికి స్థలాలను క్రమబద్ధీకరిస్తారు. ఖమ్మం కార్పొరేషన్‌లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గజం స్థలం విలువ రూ. 10 వేల వరకు ఉన్నాయి. వీడీవోస్ కాలనీ, బ్యాంక్ కాలనీ, గాంధీ చౌక్, బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం, రాపర్తినగర్ వంటి ప్రాంతాలతోపాటుగా పలు ప్రధాన రహదారుల వెంబడి స్థలాలు, జిల్లాలోని మునిసిపల్ కేంద్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అంత పెద్ద మొత్తంలో మార్కెట్ ధరలు ఉన్నాయి. అవి మినహా మిగిలిన ప్రాంతాల్లో రూ.5వేల లోపే ఉన్నట్టుగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని చాలా ప్రాంతాల్లో గజం విలువ రూ. 3 వేలు ఉన్నవే అత్యధికంగా ఉన్నాయి. ఈ

మిగతా 7వ పేజీలో...



‘జంట’ ఆత్మహత్యాయత్నం

- యువకుడితో వివాహిత ప్రేమ వ్యవహారం
- మరో యువతితో పెళ్లికి సిద్ధమైన యువకుడు
- ఇద్దరి మధ్య కొన్నిరోజులుగా గొడవ
- దెందుకూరు రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యాయత్నం
- ఇద్దరి పరిస్థితి విషమం

6

కేఎంసీ బడ్జెట్ రూ.187 కోట్లు

- ప్రణాళికేతర నిధులు రూ.99.72 కోట్లు...
- ఆస్తిపన్నుల ద్వారా రూ.30.40 కోట్లు..
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11.16 కోట్లు...
- నేడు ఆమోదించనున్న పాలకవర్గం

7





వెలవెలబోతున్న పాలేరు జలాశయం

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

- పాలేరు రిజర్వాయర్‌లో 13 అడుగుల మేర నీరు
- మరో రెండు అడుగులు తగ్గితే మూడు జిల్లాలకు తాగునీటి సరఫరా బంద్
- సాగునీటి కోసం పాతకాల్వ ఆయకట్టు రైతుల ఆందోళన

6



రోడ్డుపై బైఠాయించిన ఆయకట్టు రైతులు

రూ.2 కోట్లకు బురిడీ

- ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసం
- వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

కారేపల్లి, ఫిబ్రవరి 27: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.2కోట్లకు పైగా డబ్బులు వసూలుచేసిన వ్యక్తిపై మంగళవారం చీటింగ్ కేసు నమోదుచేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారావు తెలిపారు. మండల పరిధిలోని భాగ్యనగర్ తండాకు చెందిన ప్రేమ్‌కుమార్ పోలంపల్లి, పేరుపల్లి గ్రామాల్లో బానోత్ తులసిరామ్, అజ్మీర దివ్య, గుగులోత్ రమేష్, బానోత్ రఘు అనే వ్యక్తులకు ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారివద్ద నుంచి సుమారు రూ. రెండు కోట్లు వసూలుచేశాడు. ఉద్యోగాల విషయంపై అడిగినప్పుడల్లా దాటవేస్తూ, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డరు, నకిలీ సర్వీస్ రిజిస్టర్ ఇచ్చాడు. చివరకు మోసాన్ని గుర్తించిన బాధితులు.. ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూములు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

● పాల్వంచ రెవెన్యూ పరిరక్షణ సమితి సభ్యులు

పాల్వంచ, ఫిబ్రవరి 27: తప్పుడు ధ్రువపత్రాలతో భూములను ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాల్వంచ రెవెన్యూ పరిరక్షణ సమితి సభ్యుడు కిలారు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పాల్వంచ గట్టాయిగూడెం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లెల రవిచంద్ర అనే వ్యక్తి 2006లో 7ఎకరాల భూమిని కొనుగోలు చేసి, ఇతరులకు అమ్మడం జరిగిందన్నారు. కాగా అట్టి భూమిని ఆక్రమించుకునేందుకు ఈ మధ్య కాలంలో కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆ భూములు మావి అని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వివేక్, డీఎస్పీ వెంకటేష్‌లకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దొడ్డా రవికుమార్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, బరపటి వాసుదేవరావు, ఎర్రంశెట్టి ముత్తయ్య మహిపతి రామలింగం, వడ్లమూడి పూర్ణ, కళ్యాణం లక్ష్మీపతి, చల్లగుండ్ల వీరభద్రం, కాపర్తి వెంకటాచారి, కాల్వ ప్రకాష్, పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రెవెన్యూ పరిరక్షణ సమితి సభ్యులు

చంద్రాయపాలెం అటవీ భూముల వద్ద ఆందోళన


అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి27: మరోసారి అటవీ భూములపై స్థానికులు, అటవీ అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న సంఘటన మంగళవారం సత్తుపల్లి మండలంలో జరిగింది. మండలంలోని బుగ్గపాడు-చంద్రాయపాలెం అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారి వెంట ముత్యాలమ్మ తల్లి గుడి వెనుక కొంత భూమి ఉంది. ఇన్నేళ్లుగా ఆ భూమి తమదేనంటూ అటవీ శాఖ ఆధ్వర్యంలో రక్షణగా ఉంది. తాజాగా అట్టి భూములు ప్రభుత్వ భూములు అని, ఇళ్లులేని నిరుపేదలకు కేటాయించాలంటూ, పోడుకొట్టేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పోడును అడ్డుకున్నారు. అధికారుల తీరుకు నిరసనగా చంద్రాయపాలెం నుంచి బుగ్గపాడు వరకు ఆందోళనకారులు ర్యాలీ తీశారు. వివాదాస్పదంగా మారిన చంద్రాయపాలెం అటవీ భూములను రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేయాల్సి ఉంది. సర్వే నంబర్ 360,361, 343 నుంచి 359చెందిన భూములకు సంబంధించి రెండు దశాబ్దాలుగా వివాదం నెలకొంది. అయినా రెవెన్యూ శాఖ మాత్రం పట్టించుకోవడం లేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ సమస్య పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివాదాస్పద సర్వే నెంబర్లలో భూమిని అటవీ శాఖ, రెవెన్యూ జాయింట్ సర్వే చేయించి భూమి ఎవరిది అనేది తేల్చితే వివాదానికి పరిష్కారం లభించే అవకాశం ఉంది. జాయింట్ చేశామని, అవసరాన్ని బట్టి జాయింట్ సర్వే నిర్వహిస్తామని తహసీల్ధార్ యోగేశ్వరరావు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి27: భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వెలువడిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల దరఖాస్తు చేసుకునేందుకు ఐడీవోసీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు కిక్కిరిసిపోయారు. మంగళవారం రెండో రోజు దరఖాస్తు చేసుకునేందుకు అధిక సంఖ్యలో అభ్యర్థులతో పాటు తల్లిదండ్రులు, సంరక్షకులు బారులు తీశారు. సుమారు 2500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయా నికి రాగా వారిని అదుపు చేసేందుకు సిబ్బంది పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఒక్కసారిగా నిరుద్యోగ అభ్యర్థులు సంఖ్య పెరిగిపోవడంతో ఐడివోసి మొత్తం కిక్కిరిసిపోయింది. మొత్తం 73 పోస్టులకు గాను అధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదు ప్రక్రియ జరుగుతుంది. బుధవారం దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.


దరఖాస్తులు ఇస్తున్న నిరుద్యోగులు

న్యూడెమోక్రసీ దళసభ్యుడి అరెస్టు

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 27: న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం అశోక్ దళసభ్యుడు నాయిని కొమరయ్య(అలియాస్ కొండన్న)ను మంగళవారం భద్రాద్రి జిల్లా ఇల్లెందు పోలీసులు అరెస్టు చేశారు. ఇల్లెందు సీఐ టీ. కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లెందు మండలం, మానిక్యారం గ్రామానికి చెందిన కొండన్న గత కొంత కాలంగా న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గంలో పనిచేస్తున్నాడని వివరించారు. ఈ నెల 16న ఇల్లెందు మండల పరిధిలోని పూసపల్లి అటవీ ప్రాంతంలో అశోక్ దళం సమావేశం నిర్వహించిందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి అశోక్‌తో పాటు మరి కొందరిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపాడు. ఈ క్రమంలో కొమరయ్య పారిపోయాడని సీఐ ప్రకటించారు. కొమరయ్య కోసం గాలిస్తుండగా మంగళవారం ఇల్లెందు మండల పరిధిలోని రొంపేడు వద్ద పోలీసులకు పట్టుపడ్డాడని, అతడి నుంచి ఐదు జిలెటిన్ స్టిక్స్, ఐదు డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వెల్లడించారు. చట్టవిరుద్ధగా అడవుల్లో ఆయుధాలతో సంచరించే నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని సీఐ కరుణాకర్ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

సర్వేతో సరి..


133వ సర్వే నంబర్‌లో సాగులో ఉన్న వరి

● సర్వే చేసినా పరిష్కారం కాని భూ సమస్య

● రైతుబంధు, రుణాలు అందక రైతుల ఇబ్బందులు

సత్తుపల్లి, ఫిబ్రవరి27: సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో 133సర్వే నెంబర్‌లో భూ సమస్య దశాబ్దాల తరబడి పరిష్కారం కావడం లేదు. గత ప్రభుత్వ హాయంలో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హడావుడిగా సర్వే చేయించి చేతులు దులుపుకున్నారు. దీంతో 133సర్వే నంబర్‌లో రైతులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. సమస్యలు పరిష్కరిస్తామంటూ హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు పట్టించుకోకపోవడంతో ఈ సర్వే నంబర్‌లో భూములు ఉన్న రైతులు హక్కులు పొందలేక, రైతుబంధు, రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ధరణి పోర్టల్‌లో నమోదు కాని అన్నదాతల పేర్లు

సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో 133సర్వే నంబర్‌లో 3,090ఎకరాల విస్తీర్ణంలో పట్టా భూమి రైతులు కలిగి ఉన్నారు. గతంలో సంప్రదాయ పహణీ రెవెన్యూ సిబ్బంది రాసిన రోజులలో ఇదే సర్వే నంబర్‌లో ఇష్టారాజ్యంగా రైతులకు భూములు కలిగి ఉన్నట్లు పేర్లు నమోదు చేయడంతో పహణీలో సుమారు 6,000ఎకరాలకు రైతుల పేర్లు నమోదయ్యాయి. వాస్తవంగా 3,090ఎకరాల విస్తీర్ణం ఉండగా వేలాది ఎకరాలకు రైతుల పేర్లు నమోదు చేయడంతో వాస్తవంగా భూమి సాగు చేసుకుంటున్న రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గత ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పేరుతో కార్యక్రమం చేపట్టగా, అప్పట్లో అధికారులు సాగులో లేని రైతుల పేర్లను తొలగించారు. అయినప్పటికీ వాస్తవ విస్తీర్ణానికి మించి పేర్లు ఉండటంతో తర్వాత ధరణి పోర్టల్‌లో పేర్లు అప్‌లోడ్ చేసే సమయంలో 3090ఎకరాల విస్తీర్ణం మాత్రమే అధికారులు రైతుల పేర్లు అప్‌లోడ్ చేశారు. దీంతో సాగులో లేని రైతులు, అసలు భూమే లేకుండా కొందరు రైతుల పేర్లు ధరణిలో నమోదయ్యాయి. భూమి ఉండి తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములు సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు ధరణిలో రాలేదు. కొత్త పాస్ పుస్తకాలు కూడా వీరికి అందలేదు. ధరణి పోర్టల్ గ్రీవెన్స్‌లో తమ సమస్యను దరఖాస్తు చేసినా ఆర్ఎస్ఆర్ ఖాళీ లేకపోవడంతో అధికారులు అసలు రైతులకు న్యాయం చేయలేకపోయారు. అప్పటి నుంచి రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

సర్వేకు ఆదేశించిన గత ప్రభుత్వం...

బేతుపల్లి 133సర్వే నంబర్‌లో రైతుల సమస్యల పరిష్కారం కోసం 2021లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. ఆ మేరకు 133సర్వే నంబర్‌లో రైతులు ఎవరు ఎంత విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్నారనే విషయంపై సర్వే చేయాలని ఆదేశించిన మేరకు అప్పట్లో మొత్తం విస్తీర్ణం సర్వే చేశారు. వీటితో పాటు 134నుంచి 155వ సర్వే నంబర్ వరకు ఉన్న భూములను కూడా సర్వే చేశారు. ఆ తరువాత దీనిని పట్టించుకోకపోవడంతో రైతుల సమస్య అలాగే మిగిలిపోయింది. పక్కనే ఉన్న ఎస్సైన్‌మెంట్ భూములు కొనుగోలు చేసిన వారు కూడా 133సర్వే నంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. సర్వే ప్రకారం వాస్తవ రైతులను రికార్డులలో ఉంచి భూమిలేని వారి పేర్లు, అసైన్‌మెంట్ భూమి సాగు చేసుకుంటూ 133లో టైటిల్ పొందిన వారిని తొలగిస్తామని అధికారులు ప్రకటించినా, ఆ మేరకు జరగకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అనాదిగా భూములు సాగు చేసుకుంటున్న తమకు ఎప్పటికి న్యాయం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుజాతనగర్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

సుజాతనగర్, ఫిబ్రవరి 27: బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఎంపీపీపై అవిశ్వాసానికి సంబంధించి ఈ నెల 7న కొత్తగూడెం ఆర్డీఓ మధుకు తీర్మానం అందజేశారు. ఈ మేరకు డీఆర్‌ఓ ఎం రవీంద్రనాథ్ సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 8 మంది ఎంపీటీసీలకు గాను 6 మంది ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కావడంతో డీఆర్‌ఓ ఆధ్వర్యంలో అవిశ్వాస ఓటింగ్ నిర్వహించారు. దీంతో కాంగ్రెస్ చెందిన ఎంపీటీసీలు కస్నబోయిన భద్రం, వైస్ ఎంపీపీ భూక్యా అనిత, సీపీఐకి చెందిన పద్మావతి, మోహన్, బీఆర్ఎస్ ఎంపీటీసీలు బత్తుల మానస, మూడ్ గణేష్‌లు అవిశ్వానికి మద్దతుగా చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లుగా డీఆర్‌ఓ ప్రకటించారు. కాగా గతంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా బీఆర్ఎస్‌కు చెందిన ఒక ఎంపీటీసీ మాత్రమే తీర్మానంలో సంతకం చేయగా అనూహ్యంగా మరో బీఆర్ఎస్ ఎంపీటీసీ కూడా అవిశ్వాస తీర్మానానికి హాజరై తన మద్దతు తెలపడం విశేషం. అవిశ్వాస తీర్మానాన్ని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.


అవిశ్వాస సమావేశానికి హాజరైన సభ్యులు

ఎస్సీ హాస్టళ్లకు కంప్యూటర్లు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 27: ప్రభుత్వం ఎస్సీ సంక్షేమ వసతిగృహాలకు సౌకర్యాల కల్పనపై దృష్టిసారించింది. ప్రతీ సంవత్సరం రెండు జతల బూట్లు, నాలుగు జతల దుస్తులు, క్రీడా దుస్తులు, ఉన్ని దుస్తులు, బెట్ షీట్, కార్పెట్, రగ్గు, స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, ప్లేట్, గ్లాసు, విద్యార్థి తరగతులను బట్టి స్టడీ మెటీరియల్, పరుపులు అందజేస్తున్నారు. తాజాగా ఆధునిక కంప్యూటర్లను కూడా అందుబాటులోకి తెచ్చారు.

50 హాస్టళ్లకు కంప్యూటర్లు..

ఖమ్మం జిల్లాలో 11 కాలేజీ హాస్టళ్ల, 39 ప్రాథమిక, ప్రాథమికోన్నత సంక్షేమ వసతిగృహాలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది జిల్లాలోని 50 సంక్షేమ వసతిగృహాలకు టీవీలు, పెన్ డ్రైవ్‌లు అందించారు. విద్యాభ్యాసం కోసం కావాల్సిన వీడియోలు, చిత్రాలను పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసుకొని వాటిని టీవీల ద్వారా వీక్షించే ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థుల చదువుకు కావాల్సిన వీడియోలు, చిత్రాల కోసం బయటకు వెళ్లాల్సి రావటంతో టీవీలు, పెన్ డ్రైవ్‌లు పలు సంక్షేమ వసతిగృహాల్లో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వం జిల్లాలోని 50 సంక్షేమ వసతిగృహాలకు కంప్యూటర్లను మంజూరుచేసింది. ఒక్కో కంప్యూటర్‌ను రూ.50వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసి అందజేశారు.


కంప్యూటర్లను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ఖమ్మంలో ప్రారంభించిన డీడీ కస్తాల..

ఖమ్మం ఎస్సీ బీ బాలుర వసతిగృహంలో ప్రభుత్వం సమకూర్చిన కంప్యూటర్లను డీడీ కస్తాల సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రింటర్లు కూడా అందస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు శ్రీనివాసరెడ్డి, పరిశ్రమలశాఖ డీఎం అజయ్‌కుమార్, తెలంగాణ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొటపాడు రుక్మారావు, ఎస్ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా ఎన్జీవో కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రామారావు, సాయిభార్గవ చైతన్య

చుంచుపల్లి, ఫిబ్రవరి27: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా అమరనేని రామారావు, జిల్లా కార్యదర్శిగా కంచర్ల సాయిభార్గవ చైతన్య, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్.రామనర్సయ్య, కోశాధికారిగా జె.సోమయ్య, ఉపాధ్యక్షులుగా గడ్డం ఉష, ఊటుకూరు నాగేశ్వరరావు, గొల్లమందల రమేష్, జాయింట్ సెక్రటరీలుగా టి.అరుణ, మధుసూధన్‌రెడ్డి, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అమరనేని రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను జిల్లాలో పేద ప్రజలకు చేరేలా కృషి చేస్తామని అన్నారు. గెజిటెడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ఐక్య కార్యచరణతో ఉద్యోగస్తులకు రావలసిన అన్ని న్యాయబద్ధమైన విషయాలను కేంద్ర సంఘం ద్వారా ప్రభుత్వానికి విన్నవించి అందరికీ న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా కార్యదర్శి సాయి భార్గవచైతన్య మాట్లాడుతూ గతంలో జీవో 317 ద్వారా చల్లా చెదురు అయిన కుటుంబాలను ఒకే దగ్గరకు తీసుకురావాలనే సంకల్పంతో నూతన ప్రభుత్వం ఆ జీవోపై అధ్యాయనం చేసి నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేకూర్చాలని సదుద్దేశ్యంతో ముగ్గురు సీనియర్ మంత్రులతో కమిటీని వేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీనికి ఎన్నికల అధికారిగా జి.వీరబాబు నిర్వహించారు.

మధుకాన్‌లో మార్చి5న ముగియనున్న క్రషింగ్

నేలకొండపల్లి, ఫిబ్రవరి27: మండల పరిధిలోని రాజేశ్వరపురం వద్ద ఉన్న మధుకాన్ షుగర్, పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో 2023-2024కు సంబంధించిన చెరుకు క్రషింగ్ మార్చి5తో ముగిస్తున్నట్లు మధుకాన్ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమతమ పొలాలలో మిగిలిపోయిన చెరుకును గడువు తేదీ లోపుగా ఫ్యాక్టరీకి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. కావున రైతులు తమ పొలాల్లోని చెరుకు ను గడువు కంటే ముందే తోలటానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను కోరారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

కారేపల్లి, ఫ్రిబవరి27: మండల పరిధిలోని గాంధీనగరం గ్రామానికి చెందిన పూనెం సాయికృష్ణ(17) ఈనెల 24న ఇల్లెందు మండలం బొజ్జాయి గూడెం వద్ద సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకుని తిరిగి వస్తుండగా పెట్రోల్ బంకు వద్ద ద్వి చక్ర వాహనం అదుపుతప్పింది. దీంతో తీవ్ర గాయాలైన సాయికృష్ణను 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

తల్లాడ: పాముకాటుకు గురై 20రోజులుగా చికిత్స పొందుతూ వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. తల్లాడ మండలం గూడూరు గ్రామానికి చెందిన కొనకంచి విజయ్ అలియాస్ యాకోబు(52) ఈనెల 7న ఆడుకోవడానికి వెళ్లిన కుమార్తె దివ్యను ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో ఆయనను పాము కాటేసింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆసు పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ యాకోబు మృతి చెందాడు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మోటర్ల అపహరణ

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న విద్యుత్ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల క్రితం అపహరించారు. మోటర్ల విలువ రూ.38 వేల వరకు ఉంటుంది. మంగళవారం ఎంపీవో బి. శ్రీనివాస్, కార్యదర్శి నాగరాజు ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డీవైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

చుంచుపల్లి, ఫిబ్రవరి27: డీవైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చుంచుపల్లి మండలం విద్యానగర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన గోగుల నరసింహారావు(27) పాల్వంచ వెళ్లి తిరిగి జూలూరుపాడుకు వెళ్తున్న క్రమంలో విద్యానగర్ కాలనీ వద్ద డీవైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

44 వాహనాల సీజ్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి27: నెంబరు ప్లేటు లేకుండా నగరంలో రోడ్లపై తిరుగుతున్న 44 వాహనాలను సీజ్ చేసినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో రిజిస్టర్ లేని నెంబరు లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్టు తెలిపారు. నెంబరు ప్లేటు ట్యాంపరింగ్ చేసిన స్పోర్ట్స్ బైక్‌లపై కేసు నమోదు చేసేందుకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈఫిబ్రవరిలో ఇప్పటి వరకు 203వాహనాలకు జరిమానా విధించామని ఏసీపీ తెలిపారు.

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు

● మళ్లీ డెడ్ స్టోరేజీకి పాలేరు జలాశయం ● ప్రస్తుతం రిజర్వాయర్‌లో 13 అడుగుల మేర నీరు

● మరో రెండు అడుగులు తగ్గితే మూడు జిల్లాలకు తాగునీటి సరఫరా బంద్ ● సాగునీటి కోసం రైతుల ఆందోళన

కూసుమంచి, ఫిబ్రవరి 27: కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం నీటిమట్టం మళ్లీ డెడ్‌స్టోరేజీకి పడిపోయింది. దీంతో వారం రోజుల్లో ఖమ్మంజిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు తాగునీటి ఎద్దడి రానుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులకు గాను ప్రస్తుతం 13 అడుగులు ఉంది. మరో రెండు అడుగుల తగ్గితే తాగునీటి పథకాలకు నీరు వాడుకునే అవకాశం ఉండదు. జనవరి నెలాఖరులోనే ఈ పరిస్థితి ఏర్పడటంతో రాష్ట్రప్రభుత్వం 1.5టీఎంసీలు నీటిని కేటాయించి ఫిబ్రవరి 1న నీటిని విడుదల చేసింది. కానీ ఎడమ కాల్వ ఎగువన రైతులు గేట్లు ఎత్తడంతో పాలేరుకు నీటి రాక తగ్గిపోయింది. దీంతో పాలేరుకు కేవలం 0.75 టీఎంసీల (16.5 అడుగులు) నీరు మాత్రమే చేరింది. ఈ నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకే వాడుతుండగా నాలుగురోజులకు ఒక అడుగు చొప్పున తగ్గిపోవడంతో రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 13అడుగులకు చేరుకుంది. మరో రెండు అడుగులకు తగ్గితే ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీటి సరఫరా బంద్ అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే మూడు జిల్లాలకు తాగునీటి గండం ఏర్పడుతుంది.


పాత కాల్వ లాక్‌లు ఎత్తేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

సందర్శించిన మిషన్‌భగీరథ ఈఈ

ఇదిలా ఉండగా మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, డీఈ మురళీకృష్ణ మంగళవారం పాలేరు జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలేరు జలాశయం ద్వారా ఉమ్మడి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో 2439 ఆవాస ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. రిజర్వాయర్‌లో నాలుగురోజులకు ఒక అడుగు నీరు తగ్గిపోతుండడంతో ప్రస్తుతం ఉన్న నీరు కేవలం 10రోజులకు మాత్రమే సరిపోతాయని తెలిపారు. రిజర్వాయర్‌లోని నీటిని తాగునీటికి తప్ప ఇతర అవసరాలకు వినియోగించే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.

పొలాలను కాపాడాలని వినతి

పాలేరు పాతకాల్వకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు మంగళవారం పాతకాల్వ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన వందలాది మంది రైతులు పాలేరు జలాశయం వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. రైతులందరూ గేట్ల వద్దకు వెళ్లి నీరు వదలకుండా వేసిన కంచెను సైతం తొలగించేందుకు ప్రయత్నించారు. ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగుమండలాల ఎస్ఐలు, సిబ్బంది రైతులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి ఆదుకోవాలని కోరారు.


వైద్యశాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం జిల్లాలో గల వైద్య ఆరోగ్యశాఖలలోని ఎన్‌హెచ్ఎం విభాగంలో వివిధ కేటగిరిలో 56 తాత్కాలిక అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ .వి.సుబ్బారావు తెలిపారు. వైద్యాధికారి పోస్టుకు ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు అర్హులని, మిగిలిన క్యాటగిరీలకు సంబంధించిన ఉద్యోగాలకు అర్హత నియమాలు వెబ్‌సైట్‌లో చూపిన విధంగా విద్యార్హతలుండాలన్నారు. ఖాళీలకు సంబంధించిన పూర్తి సమాచారము అభ్యర్థులు జుజ్బిరుఝుర్చుబుజ్చుబుబ్చు.జౌరి.జీలో ఉన్నాయన్నారు. ఈ పోస్టులు పూర్తి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమిస్తున్నట్లుతెలిపారు. పూర్తి వివరాలు వెబ్ సైట్ లో చూడాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రభుత్వ వెబ్ సైట్ అన్ని జీరాక్స్ పత్రాలతో మార్చి 3 సాయంత్రం 5.00గంటల లోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయా లని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో తెలిపారు.

సమయం పాటించడం లేదంటూ అడ్డగింత

● అన్నారుగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంను అడ్డుకున్న నాయకులు

తల్లాడ, ఫిబ్రవరి 27: సమయపాలన పాటించడం లేదంటూ ప్రధానోపాధ్యాయురాలిని పాఠశాల గేటు ముందు స్థానికులు అడ్డుకున్న సంఘటన తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం అన్నారుగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజిని పాఠశాలకు ఆలస్యంగా రావడంతో ప్రధానోపాధ్యాయురాలిని గేటు ముందే బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, అడ్డుకున్నారు. పాఠశాల లోపలికి ప్రధానోపాధ్యాయురాలు వెళ్లేందుకు వీల్లేదంటూ గేటు వేశారు. ప్రధానోపాధ్యాయురాలు అనేక రోజులుగా ఆలస్యంగా విధులకు వస్తున్నప్పటికీ హాజరు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయురాలి భర్త దామోదర్‌ప్రసాద్ ఎంఈవోగా మండలంలో పనిచేస్తుండటం వల్ల ఆమె సమయపాలన పాలించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆపతి వెంకటరామారావు తెలిపారు. ఈ విషయమై ఆమెను వివరణ కోరగా సెలవు పెట్టడానికే పాఠశాలకు ఆలస్యంగా వచ్చానని వివరించారు.


ప్రధానోపాధ్యాయురాలు సరోజినిని అడ్డుకుంటున్న స్థానికులు

'జంట' ఆత్మహత్యాయత్నం

● యువకుడితో వివాహిత ప్రేమ వ్యవహారం

● దెందుకూరు రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యాయత్నం

● ఇద్దరి పరిస్థితి విషమం

మధిర రూరల్, ఫిబ్రవరి 27: యువకుడితో కలిసి ఓ వివాహిత రైలుకింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మంగళవారం మధిర మండలం దెందుకూరు రైల్వేగేటు సమీపంలో జరిగింది. ఈ ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన గంతాల సాయికృష్ణ (25) అనే యువకుడు, ఓ వివాహిత(25) ఇద్దరూ కలిసి రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించారు. సదరు మహిళకు ఎర్రుపాలెం మండలానికే చెందిన ఓ వ్యక్తితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల పాప, నాలుగేళ్ల బాబు ఉన్నారు. అయితే సాయికృష్ణతో ఆమెకు స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ విషయంపై రెండునెలల క్రితం భర్తతో గొడవ పడి కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడ కొన్నిరోజులు ఉన్న తర్వాత అమ్మమ్మ ఊరు వెళ్లి అక్కడే ఉంటోంది.

ఇదిలా ఉండగా ముఠా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సాయికృష్ణకు కొన్నిరోజుల క్రితం వివాహం ఖరారైంది. ఈ విషయం తెలుసుకున్న వివాహిత.. తననే పెళ్లి చేసుకోవాలని సాయికృష్ణ మీద ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరూ మంగళవారం తెల్లవారుజామున బైక్‌పై మధిర మండలం దెందుకూరు రైల్వేగేట్ వద్దకు వచ్చారు. అనంతరం బైక్‌ను పక్కన పడేసి గుర్తుతెలియని రైలుకింద పడ్డారు. తీవ్రగాయాలతో ట్రాక్ పక్కన పడి వున్న ఇద్దరినీ రైల్వే గ్యాంగ్‌మెన్ ఉదయం వేళ గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి ఇద్దరినీ 108ద్వారా తొలుత మధిర ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సాయికృష్ణకు మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఇద్దరి తరపునా ఎవరూ ఇంకా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

కొణిజర్లలో ఆర్మీజవాన్‌కు వీడ్కోలు

కొణిజర్ల, ఫిబ్రవరి27: వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఆర్మీజవాన్ చల్లా శ్రీను(33) అంత్యక్రియలు కొణిజర్ల మండలం అన్నవరం గ్రామంలో మంగళవారం జరిగాయి. ఆర్మీలో పని చేస్తున్న శ్రీను భార్యతో కలిసి వరం గల్ జిల్లాలోని బంధువుల ఇంటికి శుభకా ర్యానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన త్రీవంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆర్మీ జవాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాల్య వివాహాల అడ్డగింత

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27: ఇద్దరు మైనర్ బాలికల వివాహాలను మంగళవారం ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. సీడీపీవో రోజారాణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓగ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఆంధ్రాలోని ఓ గ్రామంలో వివాహం చేశారు. అనంతరం గ్రామంలో విందు భోజనాలను ఏర్పాటు చేశారు. అయితే సదరు బాలిక మైనర్ అని ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. అయితే ఆధార్‌కార్డు ప్రకారం తమ కుమార్తెకు మైనర్ తీరిందని తెలపగా, విద్యార్హత పత్రం ప్రకారం మైనర్ అని ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇదే గ్రామంలో మరో మైనర్ బాలిక(16)కు వివాహం జరగనున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. ఇద్దరు మైనర్ బాలికలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాల సేకరణ అనంతరం ఇద్దరు బాలికలను కొత్తగూడెంలోని బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించారు. సంఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

వేర్వేరుగా మనస్తాపానికి గురై ఇద్దరు ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జెట్టివారిగూడెం గ్రామానికి చెందిన కె.అర్జున్(33) కుటుంబకలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణుగూరు: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని వివాహిత స్వప్న(23) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వప్నకు నాలుగేళ్ల క్రితం ఓల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌తో వివాహమైంది. ఇప్పటివరకు పిల్లలు కలగకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన స్వప్న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వివాహిత మృతి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27: పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అశ్వారావుపేటలో మంగళవారం జరిగింది. పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన పద్మ(32) ఇంట్లో భర్తలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

సమీకృత రైతుబజార్‌లో ఒకరిపై ఒకరు దాడులు

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 27: నగరంలో బ్యాంక్ కాలనీలో ఉన్న సమీకృత (ఇంటగ్రేటెడ్) రైతుబజార్‌లో ఇద్దరు కూరగాయల వ్యాపారుల మధ్య చిన్న వివాదం గాలి వానలా తయారైంది. దీంతో సదరు వ్యాపారుల్లో ఒకరు కర్రలతో దాడి చేయడంతో మరో వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఇరువర్గాలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకొని ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమీకృత రైతుబజార్‌లో ఐదారు ఏళ్లుగా డ్వాక్రా సంఘాలకు కేటాయించిన కూరగాయల దుకాణాలలో వ్యాపారం చేస్తున్న కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన మురళి, నరేష్ అనే కూరగాయల వ్యాపారులు పక్కపక్కనే దుకాణాలలో కూరగాయలు అమ్ముతుంటారు. వారి దుకాణాలను నెలరోజులకు ఒక సారి రైతుబజార్ పర్యవేక్షకులు వారి దుకాణాల నెంబర్లతో డ్రాతీసి దుకాణాల ప్రదేశాలను మారుస్తున్న ఆనవాయితీ ఉంది. దీంతో ఆదివారం ఆయా దుకాణాల మార్పు విషయమై వారి ఇరువురి మధ్య వివాదం జరిగింది. ఆగ్రహంతో మురళి అని వ్యాపారి నరేష్ అనే వ్యాపారిపై దాడి చేసి గాయపరిచాడు. కాగా ఇరువురి వ్యాపారుల ఫిర్యాదులు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

'అలుగుబావిని వాడుకలోకి తీసుకురండి'

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి 27: ఖమ్మం నగరంలోని 41వ డివిజన్‌లోని లకారం చెరువు అలుగుల వద్దనున్న అలుగుబావిని వాడకంలోకి తీసుకురావాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. మేయర్ నీరజ మంగళవారం ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి నగరంలోని బావులు, బోర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 150 ఏళ్ల క్రితం అలుగుబావిని ప్రజలు తాగునీటికి ఉపయోగించేవారన్నారు. వెంటనే వినియోగంలోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, నగరపాలకసంస్థ ఏఈ నవ్యజ్యోతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్, యాదగిరి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండదని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కార హీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు పిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెర లేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

రామయ్య కల్యాణంలో కానరాని వైభవం

కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రామరాజ్యం వచ్చింది

- ప్రజా సేవచేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది
- బాలలకు పౌష్టికాహారం అందించడం అభినందనీయం
- డిప్యూటీ సీఎం సతీమణి మల్లునందిని విక్రమార్క
- భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో నందిని ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 27: ఎంతో ప్రసిద్ధి చెందిన భద్రాద్రి రామయ్య కల్యాణంలో దశాబ్ద కాలంగా కల్యాణ వైభవం కానరాలేదని డిప్యూటీ సీఎం సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లునందిని విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యూమనెటేరియన్ మిషన్ వ్యవస్థాపకులు సద్గురు మధుసూదన్‌సాయి ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

భద్రాద్రి రామయ్య కల్యాణ వైభవం అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలంలో ఉన్న ఈ ఆలయానికి ఏమీ చేయలేకపోతున్నామనే బాధ తమను ఎంతగానో వెంటాడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రాకతో రామరాజ్యం వచ్చిందన్నారు. రామరాజ్యంలో భద్రాద్రి రామాలయాన్ని తప్పనిసరిగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క దృష్టి పెట్టారన్నారు. భద్రాద్రిలోని సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సద్గురు మధుసూదన్ సాయి ట్రస్టు ప్రారంభిస్తున్నారని ఇందుకు 50 శాతం నిధులు సమకూరుస్తుందని, మిగతా 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ప్రణాళికసిద్ధం చేయాలని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తానని మల్లు నందిని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 25 లక్షల మంది బాలలకు పౌష్టికాహారం అందుతుందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 33 దేశాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న సద్గురు మధుసూదనసాయిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు శేషాద్రి, వేణుమాదవ్ గొట్టిముక్కలను సైతం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూపాచార్య, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించిన నందిని

భద్రాద్రి రామయ్యను డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని విక్రమార్క దర్శించారు. ఈ సందర్భంగా రామాలయంలో ఆమె ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆమెకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా స్వామి వారి శాలువ, ప్రసాదం అందజేశారు. ఇదే సమయంలో దేవస్థానం వైదిక సిబ్బంది ఆమెకు ఆలయ ప్రాశస్త్యంను వివరించారు.



మధుసూదనసాయికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

స్వర్ణరాజదండం సమర్పిస్తాం

- సద్గురు మధుసూదనసాయి

భద్రాచలం, ఫిబ్రవరి 27: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి స్వర్ణరాజదండం సమర్పిస్తామని గ్లోబల్ హ్యూమనటేరియన్ మిషన్ వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదనసాయి తెలిపారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని మంగళవారం ఆయన దర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి శాలువ, జ్ఞాపికను ఆయనకు అందజేశారు. స్వర్ణరాజదండం ఏప్రిల్‌లో శ్రీరామ మహాపట్టాభిషేకం నాటికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్య, వైద్యం, ఉచిత భోజనంను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్ కుమార్, ఇంజనీరింగు విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూపాచార్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రెండు నెలల్లో రూ.1.40కోట్ల మోసం
- నేరగాళ్ల ఖాతాల్లో రూ.25 లక్షలు ఫ్రీజ్
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారనీ, సబ్‌స్క్రిప్షన్ల పేరుతో, టాస్క్‌ల పేరుతో అమాయకులకు ఎరవేస్తున్నారంటూ 'సైబర్ వల' శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన సీపీ సునీల్‌దత్ సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని అమాయకులను బురిడీ కొట్టిస్తూ అనేక రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారని సీపీ తన ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన రెండు నెలల కాలంలో 292 ఫిర్యాదు వచ్చాయని, వాటిల్లో రూ.1.40కోట్ల వరకు ఆన్‌లైన్ ద్వారా బాధితులు మోసపోయినట్లు తెలిపారు. ఆ నగదులో రూ.25లక్షలు నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. కాగా సుమారు రూ.6లక్షల నగదును బాధితుల ఖాతాలోకి పంపినట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో 24/7 ఈ కాల్‌సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. సెంటర్‌కు వచ్చే కాల్స్‌ను మేనేజ్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ను పోలీసులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్ నేరుగా అక్కడ పనిచేసే సిబ్బందికి వెళ్తుంటాయని తెలిపారు. ఈ కాల్ సెంటర్‌కు ఆయా బ్యాంకుల రిస్క్‌మేనేజ్‌మెంట్ టీమ్‌లు అనుసంధానమై ఉంటాయని, సైబర్‌నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, తక్షణ చర్యలు తీసుకునేందుకు రిస్క్‌మేనేజ్‌మెంట్ బృందాలు పనిచేస్తాయన్నారు. ఇప్పటివరకు సైబర్‌నేరగాళ్లు అప్లికేషన్స్, ఆన్‌లైన్ జాబ్, కస్టమర్ కేర్, క్రెడిట్, డెబిట్ కార్డ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆధార్ ప్రామాణీకరణ పేరుతో మోసాలకు పాల్పడ్డారని సీపీ వివరించారు.

మూడోసారి మోదీనే ప్రధాని

- రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలను గెలుస్తాం
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి మహేంద్రనాథ్‌పాండే

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 27: దేశానికి మూడోసారి నరేంద్రమోదీనే ప్రధానమంత్రి అవుతారని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి మహేంద్రనాథ్‌పాండే పేర్కొన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ మరోమారు అయోధ్య రాముడి ఆశీర్వాదంతో, ప్రజల సంపూర్ణ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. 2014లో బీజేపీకి సొంతంగా 272సీట్లు వస్తాయని అంచనా వేస్తే ప్రజలు 282సీట్లు ఇచ్చారని, కూటమిని కలుపుకొని 319 సీట్లతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశంలో ఎన్నో సంస్కరణలు చేశామని గుర్తుచేశారు. 2019 ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా 303 స్థానాలు గెలుస్తామని భావిస్తే ప్రజలు 339 స్థానాల్లో గెలిపించడమనేది మోదీ చేసిన అభివృద్ధి వల్లనే సాధ్యమైందన్నారు.

రాబోయే ఎన్నికల్లో 370కి పైగా స్థానాలతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. 2014 కన్నా ముందు కాంగ్రెస్ హయాంలో ఆర్థికవ్యవస్థలో మన దేశం ప్రపంచంలో 11వ స్థానంలో ఉండేదని, కానీ నేడు ప్రపంచంలో 5వ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా ఎదిగిందని తెలిపారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్న మోదీ సర్కార్‌కు ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మార్తనేని ధర్మారావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ, వినోదరావు, విద్యాసాగర్, భైరెడ్డి ప్రభాకర్, అంజయ్య, దేవకి వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

కేఎంసీ బడ్జెట్ రూ.187 కోట్లు

- ప్రణాళికేతర నిధులు రూ.99.72 కోట్లు...
- ఆస్తిపన్నుల ద్వారా రూ.30.40 కోట్లు..
- 15వ ఆర్థికసంఘ నిధులు రూ.11.16 కోట్లు...
- నేడు ఆమోదించనున్న పాలకవర్గం

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 27: ఖమ్మం నగరపాలక సంస్థ(కేఎంసీ) బడ్జెట్‌ను 2024-25 ఏడాదికి సంబంధించి రూ.187కోట్ల 86లక్షలతో రూపొందించారు. సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించే పాలకవర్గ సమావేశంలో దీనిని ఆమోదించనున్నారు. కాగా ప్రభుత్వం నుండి వచ్చే నిధులను కూడా నగరపాలకసంస్థకు వచ్చే ఆదాయంలో చూపించారు. అందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి, విడుదల చేయని నిధులు కూడా వస్తాయన్న ఆశతో బడ్జెట్‌లో ఆదాయంలో చూపించారు. అలాగే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు చేశామని ప్రకటించిన నేపథ్యంలో సదరు నిధులను నగరపాలకసంస్థ ఆదాయం కింద చూపించారు.

ఆశలపల్లకిలో....

నగరపాలకసంస్థకు భారీగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తూ బడ్జెట్‌ను రూపొందించారు. ఆస్తిపన్నుల ద్వారా రూ.30.40కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. నగరపాలకసంస్థకు చెందిన దుకాణాల అద్దెల ద్వారా రూ.5.13కోట్లు, స్టాంప్‌డ్యూటీ ద్వారా రూ.27లక్షలు, పారిశుధ్యం ద్వారా రూ.2.82కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.29.65లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.12.40లక్షలు ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు.

ప్రభుత్వ నిధులపై భారీ ఆశలు

ప్రభుత్వం నుండి వచ్చే నిధులపై ఈసారి భారీ ఆశలు పెట్టుకున్నారు. ప్రణాళికేతర నిధులు రూ.99.72కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. అంతేకాకుండా పట్టణ ప్రగతి ప్రణాళిక కింద 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.11.16కోట్లు వస్తాయని ఆదాయంలో చూపించారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ఖమ్మం నగరపాలకసంస్థకు ప్రతి ఏటా రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. కాగా తొలి రూ.100 కోట్లలో కేవలం రూ.44కోట్లు మాత్రమే నిధులు వచ్చాయి. ఇంకా రూ.56కోట్లు రావాల్సి ఉండగా, సదరు నిధులు వస్తాయనే అంచనాతో ఆదాయంలో చూపించారు. కాగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి ప్రకటించిన రూ.10కోట్లను కూడా ప్రభుత్వం నుండి నగరపాలకసంస్థకు వచ్చే ఆదాయంలో చూపించారు.

గత ఏడాది మిగులు నిధులు

2023-24 బడ్జెట్‌లో రూ.14కోట్లు మిగలగా, వాటిని ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ పనులకు కేటాయించారు. ఎస్సీ కాలనీల అభివృద్ధి, విలీన పంచాయతీలలో అభివృద్ధి పనులు, 57డివిజన్లలో అభివృద్ధిపనులకు రూ.13కోట్ల వరకు వ్యయం చేయాలని నిర్ణయించారు. 2023-24 బడ్జెట్‌లో రూ.కోటి మిగులునిధులుగా చూపించారు. 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన నగరపాలకసంస్థ బడ్జెట్‌ను ఆమోదించేందుకు బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించనున్నారు.

ఎల్ఆర్ఎస్‌పై కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

నేపథ్యంలో రూ.10వేల వరకు గజం ఉన్న దరఖాస్తులు కూడా తక్కువగానే ఉన్నట్టు సమాచారం.

ఆదాయం రూ. 50కోట్ల పైమాటే....

గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు రూ. 1000, వెంచర్ల దరఖాస్తులకు రూ. 10వేలు ఫీజుగా నిర్ధారించింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో 1.15 లక్షల దరఖాస్తులు రాగా అందులో పట్టణ ప్రాంతాల నుంచి 72వేల దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఖమ్మం కార్పోరేషన్ నుంచి అత్యధికంగా 51, 395 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా ఇల్లెందు నుంచి 25 మాత్రమే ఉన్నాయి. అయితే వాటిలో కొందరు దరఖాస్తుదారులు మాత్రం ఇంటి నిర్మాణాలు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో మున్సిపల్, కార్పోరేషన్ అధికారులు ఎల్ఆర్ఎస్ పాత జీవో ప్రకారం నగదు చెల్లించుకుని ఇంటి అనుమతులు జారీ చేశారు. అలా చేసిన వాటిల్లో సుమారు వెయ్యి వరకు ఉండొచ్చని అంచనా.

కాగా ప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో భూముల ధరలకు సంబంధించిన మార్కెట్ రేట్లను పెంచగా, 2020 ఆగస్టు వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం దరఖాస్తులను, వెంచర్లకు సంబంధించి స్థలాల మార్కెట్ ధరలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ ఫీజులను లెక్కిస్తే రూ. 50 కోట్లకు పైగానే ఉమ్మడి జిల్లా నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే అప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 50 శాతం వరకే ఉండొచ్చనీ, మిగతా వారు తమ దరఖాస్తులను సమర్పించని వారు ప్రస్తుతం సందిగ్ధంలో పడ్డారన్న ప్రచారం జరుగుతోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకునే సమయంలో స్థానికంగా లేనివారు, వృద్ధులు ఎందరో దరఖాస్తులకు దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష

కల్లూరు, ఫిబ్రవరి 27: కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజరు గ్రామ శివారు శ్రీ కాశ్మీరమహదేవ క్షేత్రం (అప్పయ్య స్వామి) శివాలయం మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో కాబోయే నూతన పాలక వర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్చి 7, 8, 9 తేదిల్లో శివాలయంలో మహాశివరాత్రి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్విహించేలా కాబోయే నూతన పాలకవర్గ కమిటీ సభ్యులు సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ సౌకర్యాలు ఏర్పాటు, విద్యుత్, వైద్య సదుపాయాలు, తాగునీరు, దుకాణాల ఏర్పాట్లపై వారు సమీక్షించారు. సమావేశంలో కాబోయే నూతన పాలకవర్గం చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్, నిర్వహణ కమిటీ సభ్యులు పెద్దబోయన నరిసింహారావు, బుర్రి వీరయ్య, మాడిశెట్టి శ్రీనివాసరావు, రాచబంటి శ్రీనివాసరావు, జక్కు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సత్తుపల్లి/కల్లూరు/ఏన్కూరు/తిరుమలాయపాలెం/బోనకల్, ఫిబ్రవరి27: ఇంటర్మీడియేట్ పరీక్షలు బుధవారంనుంచి ఒక్క నిమిషం నిబంధనతో నిర్వహించనున్నారు. సత్తుపల్లి మండల వ్యాప్తంగా 3017మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సత్తుపల్లిలో మొత్తం 7కేంద్రాలు ఉండగా ఉదయం 8.30గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరవ్వాలని అధికారులు కోరారు. కల్లూరు మండలంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 209 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 177 మంది పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ అతహర్‌అలీ తెలిపారు. పరీక్షలకు ఒక్క నిమిషం నిబంధన ఉందన్నారు. ఏన్కూరు మండలంలో రెండు కేంద్రాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ విద్యార్థులు 121, ఒకేషనల్ విద్యార్థులు 93 మంది, గురుకుల కళాశాలలో 228మంది పరీక్ష రాయనున్నారు. తిరుమలాయంపాలెం మండలంలో మొదటి సంవత్సరం 347మంది, రెండో సంవత్సరం 338మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. బోనకల్ మండలంలో ప్రథమ సంవత్సరంలో 222 మంది, ద్వితియ సంవత్సరంలో 196 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

రుణాల రికవరీ బాధ్యత మేనేజర్లదే

» డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27: డీసీసీబీ బ్యాంక్ బ్రాంచ్‌ల నుంచి మంజూరైన అన్ని రకాల రుణాలను రికవరీ చేయవలసిన బాధ్యత ఆయా బ్రాంచ్ మేనేజర్లదే అని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికవరీ చర్యల్లో భాగంగా బ్యాంకును మోసం చేసిన, నకిలీ పత్రాలు సమర్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాత్రమే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని స్పష్టంచేశారు. చిన్న సన్నకారు రైతులనుంచి రుణ వసూళ్ల విషయంలో ఇబ్బందులకు గురి చేయవద్దని అన్నారని పేర్కొన్నారు. రుణ వసూళ్ల విషయములో మంత్రి తుమ్మల పేరును వాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బ్యాంకు నుంచి మంజూరు కాబడిన అన్ని రకముల రుణములను బ్యాంక్ నిబంధనలను అనుసరించి మాత్రమే రికవరీ చేయాలని, అంతేకానీ ప్రభుత్వ పెద్దల పేరును దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

» అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్ష

» హాజరైన డీఈవో, చీఫ్ సూపరింటెండెంట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 27: జిల్లాలో పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులకు ఏర్పాటు చేసిన ఒకరోజు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నందున, విద్యార్థులలో పరీక్షల వ్యవస్థ పై విశ్వాసం కలిగేలా నిర్వహణ ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 10,148 మంది, ప్రైవేటు పాఠశాలల నుండి 6,429 మంది, ప్రైవేటుగా 279 మంది, మొత్తంగా 16,577 మంది పరీక్షలు రాయనున్నట్లు, వీరిలో 8,532 మంది బాలురు, 8,045 మంది బాలికలు ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసి, 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 98 మంది శాఖా అధికారులు, 1,983 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 53 జోన్లుగా, 6 రూట్లుగా విభజించి, 5 ఫ్లయింగ్ స్క్వాడ్, 97 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించాలన్నారు. కనీస మందులతో ఏఎన్ఎం, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వాటర్ బాయ్ నుండి చీఫ్ సూపరింటెండెంట్ వరకు పరీక్షల విధుల్లో ఉన్న వారందరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. 18 మార్చి నుండి పదో తరగతి పరీక్షలు జరుగనున్నట్లు, ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగు నీరు, కనీస మౌళిక సదుపాయాల కల్పించాలన్నారు. . ఇన్విజిలేటర్లు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవాలని. ఉదయం 9.35 నిమిషాల తర్వాత పరీక్షకు అనుమతించవద్దని సూచించారు. విద్యార్థులు, అధికారులు, సిబ్బంది అందరికి ఫ్రిస్కింగ్ చేపట్టి, తనిఖీలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రంలో విధుల నిర్వహణ అధికారులకు సంబంధించి బంధువులు ఎవ్వరు పరీక్షలు వ్రాయట్లేదని ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లకు లాటరీ పద్దతి ద్వారా గదుల కేటాయింపు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించవద్దని ఆయన అన్నారు. ప్రశ్నాపత్రంలోని ప్రతి పేజీలో విద్యార్థి హాల్‌టికెట్ నెంబర్ రాయించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటు ఉండాలన్నారు. గోడ గడియారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రశ్నాపత్రాలు సీసీ కెమెరాల నిఘాలో తెరవాలన్నారు. ఎక్కడ ఎటువంటి చిన్న తప్పిదం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనా, ఎంఈవోలు శ్రీనివాసరావు, రాములు, ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

ఎన్నికల నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధత పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డాటా నమోదు పూర్తి చేయాలన్నారు. అన్ని విభాగాల వారికి శిక్షణ పూర్తి చేయాలని కోరారు. ఎన్నికలకు కావాల్సిన సామాగ్రి సేకరణ పూర్తి చేయాలన్నారు. రూట్ అధికారులు, సెక్టార్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. జిల్లా కంట్రోల్ రూమ్ ను 24గంటలు నిర్వహించాలని, ఫిర్యాదులు, సమస్యలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలుచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అదనపు ఈవీఎంలు రాక

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లాకు కేటాయించిన అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ. గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోడౌన్ లో చేపట్టిన ఈవీఎం ల ఫస్ట్ లెవల్ తనిఖీని కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు ఈవీఎం ల ఫస్ట్ లెవల్ తనిఖీలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు 1920 కంట్రోల్ యూనిట్లు, 3994 బ్యాలెట్ యూనిట్లు, 2263 వీవీప్యాట్లను, ఈ నెల 26, 27 తేదీల్లో అదనంగా కేటాయించిన 60 కంట్రోల్ యూనిట్ల ఫస్ట్ లెవల్ తనిఖీలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తిచేసామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సిబ్బంది హుస్సేన్, వివిధ పార్టీల ప్రతినిధులు పాలడుగు కృష్ణ ప్రసాద్, జి. పున్నయ్య, చీకటి రాంబాబు, ఏ. గోపాల్ రావు, జీవ్ ఎఆర్‌ఏ. విద్యాసాగర్, బి. బాలరాజు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 12 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తాం

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

మధిర/బోనకల్ ఫిబ్రవరి 27: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అశాభావం వ్యక్తంచేశారు. విజయసంకల్పయాత్రలో బాగంగా మధిర వచ్చిన నాయకులు మంగళవారం మధిరలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పట్ల వ్యతిరేకతతో కాంగ్రెస్‌పార్టీ గెలిచిందన్నారు. రాష్ట్రంలో నలుగురు ఎంపీలను గెలపిస్తే రాష్ట్రానికి కేంద్రంనుంచి 9లక్షల కోట్లు తీసుకొచ్చామన్నారు. అదే 17మందిని ఎంపీలుగా గెలిపిస్తే మరెంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ బలమైన శక్తిగా అవతరిస్తుందని బీఆర్ఎస్ నాయకులు తమ పార్టీలోకి రావాలని ఆహ్వానం పలికారు. కమ్యూనిస్టుల పనిఅయిందని ఖమ్మం జిల్లాలో బీజేపీని గెలిపించాలని కోరారు. ఖమ్మం జిల్లాకు కేంద్రం 6జాతీయ రహదారులు, 8వేల కోట్లు మంజూరి చేసిందని చెప్పారు. ఈ యాత్ర బుధవారం మహబూబాబాద్ జిల్లాకు చేరుకుంటుందన్నారు. సమావేశంలో బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ దర్మారావు, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గెల్లా సత్యనారాయణ, మధిర అసెంబ్లీ ఇంచార్జి ఏలూరు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు. బోనకల్ మండలంలో యాత్ర విజయవంతంగా కొనసాగింది. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మధిరలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

జరిగిన అభివృద్ధి చెప్పేందుకే విజయయాత్ర: కేంద్రమంత్రి

కూసుమంచి/నేలకొండపల్లి భారత్‌లో పదేళ్లగా ప్రధాని మోడీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని వివరించేందుకే విజయ సంకల్పయాత్ర చేపట్టినట్లు కేంద్ర భారీపరిశ్రమల శాఖామంత్రి మహేంద్రనాథ్‌పాండే తెలిపారు. మంగళవారం కూసుమంచిలో జరిగిన విజయసంకల్పయాత్రలో ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చేవిధంగా బూత్‌స్థాయిలో కృషిచేయాలన్నారు. కార్యాక్రమంలో నాయకులు కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, దేవకీ వాసుదేవరావు, జిల్లా ప్రధానకార్యదర్శి రవికుమార్ శ్యామ్‌రాథోడ్, మేకసంతోష్, మల్లారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నేలకొండపల్లి మండలం నుంచి విజయసంకల్ప యాత్రకు భారీగా జనం తరలివచ్చారు.

వైరా మునిసిపాలిటీలో అధిక ఇంటిపన్నులు తగ్గించాలి

వైరా, ఫిబ్రవరి 27: రాష్ట్రంలోనే వైరా మునిసిపాలిటీలో ఇంటిపన్నుల భారం అధికంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు ఆరోపించారు. ప్రజలపై అధిక ఇంటిపన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళవారం వైరా మునిసిపాలిటీ కార్యాలయ అధికారులను కలిసిన రాంబాబు భారంగా ఉన్న ఇంటిపన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. వైరా మునిసిపాలిటీలో రూ.98లక్షల నుంచి రూ.3కోట్ల పన్నుల టార్గెట్ ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఈ భారీ పన్నులను చూసి ప్రజలు నిర్ఘాంతపోతున్నారని తెలిపారు. వైరాలోని బ్రాహ్మణపల్లి, బోడేపూడి కాలనీ, గండగలపాడు, లాలాపురం తదితర ప్రాంతాల్లోని నిరుపేదల నివాస గృహాల్లో కొంతమందికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఇంటిపన్నులు ఎలా పెరిగాయని నిలదీశారు. గత ఏడాది ఇంటిపన్నులు చెల్లించిన వారికి కూడా పెరిగిన అదనపు పన్నుల భారాన్ని ఎలా వేశారని ప్రశ్నించారు. వైరా మునిసిపాలిటీ 2018లో ఏర్పడిన సమయంలో ఐదుసంవత్సరాలు ఇంటిపన్నులు పెరగవని, ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రకటించిన ప్రభుత్వం ఐదేళ్లు పూర్తికాకుండానే ఇష్టానుసారం ప్రజలపై పన్నుల భారం మోపిందని ఆక్షేపించారు. పన్నుల భారాన్ని విరమించుకోవాలని లేనట్లయితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఎం పట్టణ సభ్యుడు పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్నానాల లక్ష్మీపురం ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

వైరా, ఫిబ్రవరి 27: వైరా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్‌లో బుధవారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్ఎస్ఎస్.కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా గండగలపాడు, స్నానాల లక్ష్మీపురం, గౌండ్లపాలెం, పూసలపాడు, సిరిపురం, స్టేజీ పినపాక గ్రామాలకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నామని ఈ గ్రామాల ప్రజలు సహకరించాలని సూచించారు.

వైభవంగా సాయినాథుని పల్లకి సేవ

తల్లాడ, ఫిబ్రవరి 27: తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో మంగళవారం సాయినాథుని పల్లకిసేవ వైభవంగా జరిగింది. షిర్డీసాయిబాబా మందిరం వార్షికోత్సవం సందర్భంగా సద్గురుసాయి సేవ సమితి ఆధ్వర్యంలో అఖండ సాయినామం, పల్లకిసేవ, గ్రామ పురవీధుల్లో భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు మారెళ్ల లక్ష్మణ్‌రావు, పూనాటి సత్యం, నున్నా సాందీపులు, తుమ్మలపల్లి రమేష్, ఆపతి రామారావు, మారెళ్ల వెంకటయ్య, పొన్నం కృష్ణయ్య పాల్గొన్నారు.

నేటినుంచి కరుణగిరి ఉత్సవాలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27: మండల పరిదిలోని కరుణగిరిలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న కరుణగిరి ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నట్లు కరుణగిరి డైరెక్టర్ మాధ్యూవరప్రసాద్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణతో పాటుగా పక్క రాష్ట్రాల నుంచి కూడా క్రైస్తవ సోదరులు ఉత్సవాలకు హజరవుతారని తెలిపారు. మార్చి 2వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సీసీ పనుల ప్రారంభం

బోనకల్, ఫిబ్రవరి 27: మండలంలోని నారాయణపురం గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ద్వారా మంజూరైన రూ. 5లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ నాయకుడు సూర్యదేవర సుధాకర్‌ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తినేని తిరుపతయ్య, బండి పవన్, కోట యువరాజు, కోట శ్రీనివాసరావు, కిషోర్, ఏసు, ప్రభాకర్, శరాబంది, భూపతి తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 27: ఖమ్మం జిల్లాలోని అర్బన్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈఓలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయనిర్మల సూచించారు. పంట సర్వేలో భాగంగా మల్లెమడుగు రెవెన్యూ గ్రామంలో పంటల నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి బి కిషోర్‌బాబు, ఏఈవో శిరిణ్మయి, రైతులు నరేష్, శ్రీను, మూర్తి పాల్గొన్నారు.

విద్య కాషాయికరణ కోసమే

నూతన విద్యావిధానం: ఏఐఎస్ఎఫ్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 27: లౌకిక విధానాలకు తగిన విధంగా ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా విద్యావిధానం కొనసాగగా మోదీ ప్రభుత్వం విద్యను కాసాయికరణగా మార్చేందుకు నూతన విద్యావిధానం అమలులోకి తీసుకొచ్చిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. మంగళవారం ఖమ్మంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విప్లవ నాయకులు చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం కోసం యువతను ముందుకు నడిపిన నాయకులు ఆజాద్‌గా పేర్కొన్నారు. నాయకులు కౌశిక్, గోపి, అయ్యప్ప, రాకేష్, ప్రతాప్‌రాజు, సునీల్, సృజన్, వెంకట్‌సాయి, పవన్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాల చైర్మన్ నిశితాశర్మ

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి27: ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాల చైర్‌పర్సన్ నిశితాశర్మ అన్నారు. నగరంలోని పోలీసుపరేడ్ ప్రాంగణంలో ఉన్న కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిశితాశర్మ మాట్లాడుతూ లక్ష్యం సాధించడానికి ఏకాగ్రత అవసరమని, ఇష్టపడి చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సునీల్‌సింగ్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిశితాశర్మ

వేపకుంట్లలో తాగునీటి సమస్య పరిష్కారం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 27: 20రోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న వేపకుంట్ల గ్రామస్థులకు కొంత ఊరట కలిగింది. వేపకుంట్లలో తాగునీటి ఎద్దడిపై గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల ప్రత్యేకంగా బోర్, మోటరు ఏర్పాటు చేయించారు. బోరు నీటి వద్దకు వచ్చిన గ్రామస్థులు సంబురాలు జరిపారు.

డీఆర్ఎస్ కళాశాలలో రక్తదాన శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 27: ఖమ్మంనగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రక్తదానం మహాదానమని ఒకరు రక్త దానం చేస్తే ముగ్గురిని కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు డాక్టర్ బాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు భావక్‌పాటిల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరు నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలం, వెంకటగిరి గ్రామంలో మినీ క్రీడామైదాన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం కళ్యాణ లక్ష్మీ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం 59వ డివిజన్ దానవాయిగూడెంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

విద్యార్థుల భావోద్వేగాలను గమనించాలి

» సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ



మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 27: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల భావోద్వేగాలను ఎప్పటికప్పుడు సంక్షేమాధికారులు పరిశీలిస్తూ ఉండాలని, యుక్త వయస్సులో వచ్చే మానసిక అవగాహన కల్పించాలని ఖమ్మం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం టీటీడీసీ భవనంలో మర్రిచెన్నారెడ్డి మానవవనరుల శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సంక్షేమాధికారులకు రెండు రోజులు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణను ప్రారంభించిన కస్తాల సత్యనారాయణ విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యుక్త వయస్సులో వచ్చే సమస్యలు, భావోద్వేగాల నియంత్రణ, మానసిక వత్తిడి వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రాంతీయ శిక్షణాధికారి ఆనంద్‌కుమార్, తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

ముదిగొండ, ఫిబ్రవరి 27: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ పసుపులేటి దుర్గ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమం గురించి గ్రామాల్లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, వైద్యురాలు అరుణాదేవి, డాక్టర్ ధర్మేందర్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

» ఘనంగా 'వికాస్' పాఠశాల 10వ వార్షికోత్సవం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 27: ఖమ్మం నగరంలోని వికాస్ పాఠశాల 10వ వార్షికోత్సవం మంగళవారం నగరంలోని సీక్వెల్ లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ సురభి, డీఈవో సోమశేఖర్ శర్మ , వికాస్ విద్యాసంస్థ కరస్పాండెంట్ లావణ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా కవి యం. శ్రీనివాసరావు, జిల్లా ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు జి. కాంతారావు , 54వ డివిజన్ కార్పొరేటర్ యం మంజుల హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రేపటి తరానికి కావలసిన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, విద్యార్థులు సమాయత్తం కావాలన్నారు. అవకాశాలను వినియోగించుకొని, సృజనాత్మకతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ బోధించాలన్నారు. వికాస్ ఇటువంటి కృషి జరపడం అభినందనీయమన్నారు. డీఈవో, నగర మున్సిపల్ కమిషనర్ , పాఠశాల కరస్పాండెంట్ లావణ్య, జిల్లా ప్రవేటు పాఠశాలల అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులకు బోధించే పద్ధతులలో వర్క్ లెర్న్ పద్ధతిలో పాఠం నేర్పిస్తే జీవితకాలం గుర్తుంటుందని సూచించారు. తల్లిదండ్రులు మార్కులు చూసి ఇతర విద్యార్థులతో పోల్చకుండా ఉండటం, పిల్లలపై భారం పెంచడం వంటివి చేయరాదని అన్నారు. మార్కులనేవి ప్రతిభ కొలమానం కావన్నారు. వికాస్ విద్యాసంస్థలలో అన్ని కార్యక్రమాలను ప్రోత్సహిస్తుండటం సంతోషదాయకమన్నారు. సూత్రాలను వల్లెవేయడంకాక, అన్వయించటాన్ని నేర్పాలని ఉపాధ్యాయులను కోరారు. ఇంటిపనిలో చిన్న చిన్న అవసరాలలో తోడ్పడటానికి కావల్సిన శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులు గ్రహించాలని అన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.







జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం, మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిన్నారి నృత్యం

ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి: ప్రజాపంథా

కొణిజర్ల/ తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 27: హిందూత్వ శక్తులను ఎదుర్కోవాలంటే, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలంటే కమ్యూనిస్టులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఖమ్మంజిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో నిర్వహించే పార్టీ మహాసభలను జయప్రధం చేయాలని కోరుతూ మండలంలోని రామనర్సయ్యనగర్ గ్రామం నుంచి బైక్‌ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సిపై పుల్లయ్య, కె.అర్జున్‌రావు, పాశం అప్పారావు, తడికమల్ల సీతరాములు, గడ్డం లక్ష్మణ్, సక్కో, శ్రీను, మత్య, వెంకన్న, రమేష్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, కోటయ్య, సైదా పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ఖమ్మంలో మార్చి 3న జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఆపార్టీ ఆధ్వర్యంలో భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఆర్.శివలింగం తిమ్మిడి హనుమంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు , యడ్లపల్లి నవీన్, ఆరెంపుల వెంకన్న, వెంకటస్వామి, విజయ్, కె.వెంకటరెడ్డి, వి.శ్రీను, పి.మధు, ఉన్నం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల గడ్డివామి దగ్ధం

కల్లూరు, ఫిబ్రవరి 27: మండలంలోని పడమట లోకవరం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో పది ఎకరాల గడ్డి వాము దగ్ధమైంది. దీంతో బాధిత రైతుకు రూ.లక్ష ఆస్తినష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. లోకవరం గ్రామానికి చెందిన బొగ్గుల రామిరెడ్డి అనే రైతుకు సమీపానగల పెరటిలో పది ఎకరాల గడ్డిని వామీగా వేశారు. గుర్తుతెలియని వ్యక్తులు వామీ సమీపాన గల చెత్తకుప్పలో నిప్పు రగల్చటంతో గడ్డివామికి నిప్పు అంటుకుని ప్రమాదం సంభవించింది. ఈ సమయంలో గ్రామంలో గల యవకులు కొంత మంది స్పందించి ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు క్షేత్ర స్థాయిలో సందర్శించి సమాచారం సేకరించారు.


కేపీఎల్‌లో జేవీడీ చిటాస్ జట్టు విజయం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 27: ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన లీగ్ పోటీలో జేవీడీ చిటాస్ జట్టు గెలుపొందింది. అభయ అవెంజర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన జేవీడీ చిటాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన అభయ అవెంజర్స్ జట్టు 182 పరుగులు చేసి ఆలౌట్ అయి 10 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. పోటీలను టోర్నీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, మతిన్, ఓలేటి సాంబమూర్తి తదితరులు సమీక్షించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 28 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

జక్కన కోసం జేమ్స్ కామెరూన్?





షూటింగ్‌కు డేట్ ఖాయం కాలేదు, సినిమాకు పేరు ఖరారు కాలేదు, తారాగణం ఎవరనేది తేలనేలేదు అయినా నిత్యం ఏదో ఒక చర్చతో వార్తల్లో నిలుస్తోంది మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా. ఈ చిత్రానికి 'ఎస్ఎస్ఎంబీ 29' అనేది అనధికారికంగా ప్రచారంలో ఉన్న వర్కింగ్ టైటిల్. ఈ సినిమా గురించి అడపా దడపా కథకులు విజయేంద్ర ప్రసాద్ చూఛాయగా చెప్పిన విషయాలను బట్టి ఇదొక అడ్వంచరస్ యాక్షన్ డ్రామా అని తెలవడం తప్ప మరేదీ బయటకు రాలేదు. గుప్పిట మూసి ఉన్నంతవరకే గుట్టు అన్నట్లు రాజమౌళి కూడా ఈ సినిమా విషయంలో గుంభనంగా ఉంటున్నారు. కానీ కొంతమంది ఔత్సాహికులు మాత్రం ఏదో ఒక విషయంతో ఈ సినిమాను ప్రతి రోజూ చర్చనీయాంశం చేస్తున్నారు. ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో, సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్న కొన్ని విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మేకింగ్‌లోనే కాదు సినిమాకు ప్రచారం తేవడంలోనూ రాజమౌళి సిద్ధహస్తుడు. సినిమాకు మంచి హైప్ తేవడం కోసం జాతీయ మీడియాను ఆయన ఆహ్వానించనున్నారని చెబుతున్నారు. ఆ పాత్రికేయ సమావేశంలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని రాజమౌళి భావిస్తున్నారనేది సారాంశం. ఇక ఈ మధ్యన సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేస్తున్న విషయం ఈ సినిమా ప్రారంభోత్సవం గురించే. హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్‌తో రాజమౌళి క్లాప్ కొట్టించేబోతున్నారట. ఆస్కార్ సహా పలు వేదికలపై 'ఆర్ఆర్ఆర్' చిత్రం గురించి మాట్లాడుతూ రాజమౌళి దర్శకత్వ ప్రతిభను కామెరూన్ కొనియాడారు. ఈ నేపథ్యం వల్లనే కామెరూన్ వస్తాడా అనే సంశయం ఉన్నా తేలిగ్గా తీసివేయలేకపోతున్నారు. ఇక ఇటీవలే 'గుంటూరు కారం' చిత్రంతో అభిమానులను అలరించారు మహేశ్‌బాబు. ప్రస్తుతం రాజమౌళి చిత్రం కోసం ఆయన సన్నాహాలు మొదలుపెట్టారు. ఇందులో మహేశ్‌ను సరికొత్త లుక్‌లో చూపించబోతున్నారని తెలుస్తోంది. ఆ లుక్ బయటకు రాకుండా ఉండేందుకు మహేశ్ ప్రైవేట్ కార్యక్రమాలకు కూడా హాజరవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే మాట వినిపిస్తోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో ప్రీ ప్రొడక్షన్‌కు మరింత సమయం పట్టనుందట. తొలుత ఉగాదికి ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేసినా, ఇప్పుడు మహేశ్ పుట్టిన రోజైన ఆగస్టు 9న ఓపెనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలుస్తోంది. అయితే ఇవన్నీ అనధికారిక వార్తలే. వీటిలో ఏ ఒక్కదానిపైనా ఇప్పటివరకూ రాజమౌళి కానీ చిత్రబృందం కానీ స్పందించలేదు.

వీరమల్లు విజృంభణ ఖాయం



పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు క్రిష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాలపై దృష్టి పెట్టడమా? లేక మరేదైనా కారణమో తెలియదు కానీ కొన్ని షెడ్యూల్స్ పూర్తయ్యాక తాత్కాలికంగా చిత్రీకరణ నిలిచిపోయింది. అయితే పవన్ కల్యాణ్ ఈ సినిమాను దాదాపుగా పక్కనపెట్టినట్లేనని కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో మేకర్స్ ఈ ప్రచారాన్ని ఖండించారు. 'హరిహర వీరమల్లు' చిత్రం ఆగిపోలేదని చెబుతూ ఈ మధ్యనే కొత్త రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించారు. అయితే క్రిష్ అనుష్కతో హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా తీస్తున్నాడంటూ ప్రచారం మొదలైంది. దీంతో 'హరిహర వీరమల్లు'ను పక్కనపెట్టడం వల్లే ఆయన కొత్త ప్రాజెక్ట్‌ను ఓకే చేశారనే టాక్ నడుస్తోంది. దీంతో ఈ ఊహాగానాలకు తెరదించేందుకు నిర్మాత ఏఎం రత్నం రంగంలోకి దిగారు. చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'హరిహర వీరమల్లు' సినిమా ఆగిపోలేదు. దీనికి కొనసాగింపు చిత్రం కూడా ఉంటుంది. పవన్ కల్యాణ్‌ను హీరోగా మరో స్థాయికి తీసుకెళ్లే చిత్రమిది' అని తెలిపారు. 'డబ్బు కోసమే అయితే పవన్ కల్యాణ్‌తో ఏదో ఒక సినిమా చేసి సంపాదించుకోవచ్చు. కానీ మేం అలా అనుకోవడం లేదు. 'హరిహర వీరమల్లు' సినిమాతో ఆయనకు పేరు రావాలి, మాకు ఎప్పటికీ గుర్తుండిపోవాలనేదే మా కోరిక' అన్నారు. 'హరిహర వీరమల్లు చిత్రం ఆగిపోయిందంటూ కొంత మంది చేస్తున్న ప్రచారం నిజం కాదు. అవన్నీ అసత్యాలే. వాటిని నమ్మకండి' అని పవన్ అభిమానులను కోరారు. అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్ఎక్స్ పనులు చేయాల్సి రావడం వల్ల మేకింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందని గతంలో ఏఎం రత్నం చెప్పారు.

ప్రతి భారతీయుడూ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాడు

వరుణ్‌తేజ్ నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ మూవీ 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. శక్తి ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించింది. విడుదల సందర్భంగా మంగళవారం వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.



- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ 2020లో ఈ కథతో నన్ను సంప్రదించారు. కథ నాకు బాగా నచ్చింది. సోనీ పిక్చర్స్ సంస్థకే నేను ఓ సినిమా చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల అది టేకాఫ్ కాలేదు. నేషనల్ అప్పీల్ ఉన్న కంటెంట్ కావడంతో ఇది వారికి కూడా నచ్చింది. చాలా గ్రాండ్ బడ్జెట్‌తో పక్కాగా ప్లాన్ చేసి సినిమా తీశారు. దర్శకుడు ఉత్తరాదివాడే అయినా తెలుగులో చేయాలనే కోరిక ఉంది. అందుకే తెలుగు, హిందీ వెర్షన్స్‌లో తీశాం. ఒక భాషలో తీసిన వెంటనే మరో భాషలో చిత్రీకరించారు.
- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ ఈ ప్రాజెక్ట్ కోసం చాలా రీసెర్చ్ చేశారు. సినిమా అంటే అతనికి ప్యాషన్. అయినా ఏదో ఒక సినిమా చేయాలని అనుకోకుండా నా ద్వారా ఈ చిత్రకథను చెప్పాలని అనుకున్నాడు. ఇంతకుముందు అతను చేసిన షార్ట్ ఫిల్మ్ బాగా వైరల్ అయింది. ఎయిర్‌ఫోర్స్ అధికారులు కూడా అది చూసి ఆశ్చర్యపోయారు. దాన్నే సినిమా చేయాలనుకుంటే కావాల్సిన సహకారాన్ని అందిస్తామని వారు చెప్పారు. దర్శకుడికి వీఎఫ్ఎక్స్ పై మంచి పట్టు ఉండడంతో విజువల్‌గా కూడా చాలా బాగా వచ్చిందీ చిత్రం
- పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్ర దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఆపరేషన్ నిర్వహించింది. వాలెంటైన్ డే నాడు జరిగింది కనుక అలా టైటిల్ పెట్టాం. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- 'అంతరిక్షం' చిత్ర నిర్మాణ సమయంలో తొలిసారిగా విజువల్ ఎఫెక్ట్స్‌తో వర్క్ చేయడం మొదట్లో ఇబ్బందిగా అనిపించినా తర్వాత అలవాటైంది. 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్ కోసం ఫైటర్ జెట్ ఎలా పని చేస్తుంది, ఎంత స్పీడ్‌లో వెళుతుంది అనే వివరాలు ఓ పైలెట్ ద్వారా తెలుసుకున్నా. ఒక ఫ్లైట్ సిమ్యులేటర్‌లో కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతి ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే నిజంగా ఫ్లైట్ నడిపినట్లే అనిపిస్తుంది. ఇలాంటి పాత్రలు చేయడం ఓ ఛాలెంజ్. ఇందులో నేను రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని అద్భుతంగా డిజైన్ చేశారు దర్శకుడు.
- తొలిసారిగా హిందీలో నటిస్తున్నాను కనుక హిందీ నేర్చుకోవడం కోసం రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. నా భార్య లావణ్య కూడా ఈ విషయంలో హెల్ప్ చేసింది. ఒక సీన్ మొదట హిందీలో షూట్ చేసి, తర్వాత తెలుగులో తీసేవాళ్లు. అప్పుడు మధ్య మధ్యలో హిందీ డైలాగులు కూడా వచ్చేసేవి.
- ఈ సినిమా టీజర్ రిలీజ్ అయ్యాక బాబాయ్‌ను కలిశాను. ఆయన సినిమాల గురించి పెద్దగా మాట్లాడరు. కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్‌ని ఐదారు సార్లు చూసి 'చాలా బాగుంది. ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా చక్కగా ఉన్నావు. ఈ సినిమా చూడాలని ఉంది' అని ఆయన అనడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇటువంటి సినిమాలు అంటే బాబాయ్‌కి చాలా ఇష్టం.

క్రేజీ కాంబినేషన్ కుదిరింది



జైలర్ చిత్రం ఇచ్చిన సక్సెస్‌తో రజనీకాంత్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రసుతం ఆయన దర్శకుడు టీజే జ్ఞానవేల్ రాజా, లోకేశ్ కనగరాజ్‌తో సినిమాలు చేస్తున్నారు. తాజాగా రజనీకాంత్ హీరోగా మరో చిత్రం ఖాయమైంది. పలు కమర్షియల్ హిట్లు ఇచ్చిన బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్ వాలా కొత్త చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రజనీకాంత్‌ను కలసిన ఫొటోను షేర్ చేసి, 'లెజెండరీతో కలసి పనిచేసే అవకాశం నాకు దక్కిన గౌరవం. త్వరలోనే మా మరపురాని ప్రయాణం ప్రారంభిస్తాం' అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటించే అవకాశముంది.

ఆ టైమ్ వచ్చింది

తన రాజకీయ అరంగేట్రానికి ఇదే సరైన సమయం అన్నారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లో ఉంటూనే రాజకీయ పార్టీలతో తలపడ్డాను. నటిగా కన్నా దేశహితం కోరుకునే జాతీయవాదిగానే నాకు గుర్తింపు ఎక్కువ. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నాపై చాలా ప్రేమ చూపించారు. దేశం నాకు చాలా ఇచ్చింది. తిరిగి ఇవ్వడం నా బాధ్యత. ఒకవేళ నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకుంటే అందుకు ఇదే సరైన సమయం' అన్నారు. ఆమె త్వరలోనే బీజేపీలో చేరబోతున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కంగనా రనౌత్ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. అలాగే 'తను వెడ్స్ మను', 'క్వీన్ 2' చిత్రాల్లో కంగన నటిస్తున్నారు.





న్యూ ఏజ్ ఫిల్మ్ లవ్ మీ

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రానికి 'లవ్ మీ' అనే టైటిల్ నిర్ణయించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై అరుణ్ భీమవరపు దర్శకత్వంలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. టైటిల్ ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ ' ఇదొక న్యూ ఏజ్ ఫిల్మ్. 'ఆర్య' కథ విని ఎలా ఎగ్జయిట్ అయ్యానో ఈ చిత్ర కథ విని అదే అనుభూతి పొందాను. ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణం నాగ మల్లిడి. అతను నాకు ఎప్పటి నుంచో పరిచయం. ఓ స్క్రిప్ట్ వినండి.. ఫ్రెండ్‌తో కలసి తయారు చేశానని నాగ చెబితే కథ విన్నాను. నాకు నచ్చడంతో చాలా మందికి చెప్పాను. అందరూ ఎగ్జైట్ అయ్యారు. ఇలా స్క్రిప్ట్ దశలో ఎగ్జైట్ అవడం అరుదుగా జరుగుతుంటుంది. హీరోగా ఆశిష్ కావాలని అడిగారు. అలాగే హర్షిత్, హన్షితలను ఇవ్వమని నాగ అడిగాడు. స్క్రిప్ట్ పూర్తయాక టెక్నీషియన్ల పేరు చెబితే భయం వేసింది. అయినా ఛాయాగ్రాహకుడు పీసీ శ్రీరామ్‌నీ, కీరవాణిగారిని కలసి కథ చెప్పి ఒప్పించారు. ఫిబ్రవరి 27న టైటిల్ అనౌన్స్ చేశాం. ఏప్రిల్ 27న సినిమా విడుదల చేయబోతున్నాం.' ఆర్య' విషయంలో నాకు జరిగిందే ఈ టీమ్‌కు జరగబోతోందనే వైబ్స్ వస్తున్నాయి' అన్నారు. చిత్ర కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ 'ఈ మూవీ నాకు ప్రత్యేకం. ఇలాంటి స్టోరీ లైన్ ఎక్కడా చూడలేదు. త్వరలో టీజర్ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా చూశాక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌తో ప్రేక్షకులు బయటకు వస్తారు' అని చెప్పారు.



వెన్నెల కిశోర్‌కు టైలర్ మేడ్ క్యారెక్టర్



వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. కీర్తి కుమార్ దర్శకత్వంలో అదితి సోని ఈ సినిమా నిర్మించారు. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్. మంగళవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒకే ఒక్క పాట ఉంది. అది రాసే బాధ్యతను నాకు అప్పగించారు. నన్ను నమ్మి దర్శక నిర్మాతలు రావడంతో పాట బాగా రావాలని మూడు నెలల సమయం తీసుకున్నా. మంచి సాహిత్యం కుదిరింది. వెన్నెల కిశోర్ ఈ సినిమాలో బాగా నవ్విస్తారు' అని చెప్పారు. 'బెంగళూరులో పదేళ్ల యాడ్ ఫీల్డ్‌లో ఉండి సినిమాల్లోకి వచ్చా. ఇంతకు ముందు 'మళ్లీ మొదలైంది' అనే సినిమా చేశా. అందులో వెన్నెల కిశోర్‌గారు కామెడీ రోల్ చేశారు. అప్పుడే ఈ చిత్ర కథ ఆయనకు చెప్పా. కిశోర్‌గారికి ఇది టైలర్ మేడ్ క్యారెక్టర్. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుంది. మొదట ఈ సినిమాను మే నెలలో విడుదల చేయాలనుకున్నాం. కానీ మంచి డేట్ దొరకడంతో మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం.' అని చెప్పారు దర్శకుడు కీర్తి కుమార్. నిర్మాత అదితి సోని మాట్లాడుతూ 'నిర్మాతగా నాకు ఇది తొలి సినిమా. కొత్తగా ట్రై చేశాం. మంచి టీమ్ దొరికింది. వెన్నెల కిశోర్‌గారికి నేను అభిమానిని. ఆయనతో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. తెలుగులో తనకు ఇది తొలి చిత్రమని హీరోయిన్ సంయుక్త చెప్పారు. సినిమాలో తను ఫైట్స్ కూడా చేసినట్లు ఆమె తెలిపారు.

భవానీ వార్డ్‌లో ఏం జరిగింది?



గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ముఖ్య పాత్రలు పోషించిన హారర్ థ్రిల్లర్ 'భవానీ వార్డ్' ఫస్ట్ లుక్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు జీడీ నరసింహ మాట్లాడుతూ 'నేను చెప్పిన కథ నచ్చి ఇందులో నటించడమే కాకుండా పూర్తి సహకారం అందించిన గాయత్రిగారికి ధన్యవాదాలు. నిర్మాత ప్రోత్సాహంతో, నటీనటుల సహకారంతో అందరికీ నచ్చేలా ఈ సినిమా తీశాను. భవానీ వార్డ్‌లో జరిగే సంఘటనలు ఉత్కంఠభరితంగా ఉంటాయి. హారర్ చిత్రాలను ఇష్టపడే వారికే కాకుండా అందరినీ అలరిస్తుంది' అన్నారు. చిన్న సినిమాలకు ప్రోత్సాహం అందించాలనే ఈ సినిమా తీసినట్టు నిర్మాతల్లో ఒకరైన కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. టెక్నికల్‌గా సినిమా చాలా బాగుంటుందని గాయత్రి గుప్తా చెప్పారు. హీరోగా తనకు అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు గణేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సినిమాలో ఒక మంచి పాత్ర చేసినందుకు ఆనందంగా ఉందని జర్నలిస్టు సాయి సతీశ్ చెప్పారు.